క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి



పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ గురువారం 64వ డివిజన్ విఘ్నేశ్వర అపార్టుమెంటు ప్రాంతంలో ఆ పార్టీ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)లను ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి యరగొర్ల శ్రీరాములు, డివిజన్ కోఆర్డినేటర్ షేక్ ఇస్మాయిల్ ఓటర్లను విజ్ఞప్తి చేశారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ గెలిస్తేనే పేదలకు సంక్షేమ పథకాలు కొనసాగుతాయని తెలిపారు. ప్రచారంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, కన్వీనర్లు పాల్గొన్నారు.

కనులపండువగా శివ కల్యాణం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రాషిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మరకత శివలింగ వాయు ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా గురువారం శివకల్యాణం కనులపండువగా జరిగింది. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతం రెడ్డి, దొంతిరెడ్డి లక్ష్మణరెడ్డి దంపతులు కల్యాణం జరిపించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో కల్యాణం కమనీయంగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు శివకల్యాణంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ పాల్గొని మరకత శివలింగానికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరకత శివలింగం ప్రతిష్ట వల్ల బుధుడి ఆశీస్సులు లభిస్తాయని ధనయోగం కలుగుతుందని అన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో మందిర కోశాధికారి మండల పర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

బొండా సతీమణి వెంటనే క్షమాపణలు చెప్పాలి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి బొండా ఉమా సతీమణి సుజాత మంగళవారం జరిగిన ఓ సమావేశంలో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులను తిడుతూ బుడబుక్కల సామాజిక వర్గాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని, దీనికి ఆమె వెంటనే ఆ సామాజిక వర్గం వారికి క్షమాపణలు చెప్పాలని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ డిమాండ్ చేశారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ ఒక మహిళ అయ్యుండి కూడా బొండా సుజాత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని, మీటింగ్‌లు పెట్టుకున్నప్పుడు ప్రజలకు మీరేమి చేస్తారో చెప్పుకోవాలి తప్ప ఇలా అనుచిత వ్యాఖ్యలు చేయడం పద్ధతికాదన్నారు. బుడబుక్కల సామాజిక వర్గానికి బొండా సుజాత వెంటనే క్షమాపణలు చెప్పాలని 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా డిమాండ్ చేశారు.

సందడిగా విద్యార్థుల ప్రమోషన్ డే



కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యార్థి జీవితంలో ప్రమోషన్ డే మరిచిపోలేనిదని శ్రీచైతన్య స్కూల్ కృష్ణలంక బ్రాంచ్ ప్రధానోపాధ్యాయురాలు కె.మహాలక్ష్మి అన్నారు. స్కూల్ ఆవరణలో గురువారం విద్యార్థుల ప్రమోషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలు తెలుసుకుని జీవిత లక్ష్యాలను సాధించాలన్నారు. ఫన్‌తో సెలవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏజీఎం ఎం.మురళీకృష్ణ, ఆర్ఐ జె.రాజేష్, అకడమిక్ డీన్ ఆర్.రవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఎం జగన్ వెంటే రాష్ట్ర ప్రజలు

వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



59వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని, ఎన్ని కూటములు ఏకమై వచ్చినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరని ఆ పార్టీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 59వ డివిజన్ సింగ్‌నగర్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమం గురువారం జరిగింది. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానాతో కలిసి సింగ్‌నగర్ లెనిన్‌సెంటర్ పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ కరోనా వంటి కష్టకాలంలో నియోజకవర్గ ప్రజలను వదిలేసి హైదరాబాద్‌కు, విదేశాలకు పారిపోయిన బొండా ఉమా, అతని కుటుంబ సభ్యులు ఇప్పుడు ఎన్నికల సమయంలో ప్రజల కష్టాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. అధికారం ఉన్నన్ని రోజులు ప్రజల కష్టాలను పట్టించుకోకుండా రౌడీయిజంతో భూకబ్జాలకు పాల్పడిన ఉమా, అతని కుటుంబ సభ్యులు ఇప్పుడు ప్రజల మీద కపట ప్రేమను చూపుతున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల్లోనే ఉన్నామని గుర్తు చేశారు. బొండా ఉమా ప్రజా జీవితానికి పనికిరాడని ఆయనకు డిపాజిట్లు కూడా రాకుండా ఓటమిపాలవుతాడని అన్నారు. బొండా సతీమణి బుడబుక్కల వారంటూ ఆ కులాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు. నోరు ఉంది కదా అని బొండా ఇష్ట ం వచ్చినట్లు మాట్లాడటం , అధికారులను బెదిరిపులకు గురిచేయడం సరైన పద్ధతి కాదని హితవుపలికారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్నాం జగన్ అంతుచూస్తామంటూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. 2014 నుంచి 2019 వరకూ అదే కూటమి అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రానికి ఏమి చేశారని ప్రశ్నించారు. మా అభ్యర్థులను గెలిపించమని అడగాల్సిన పవన్‌కళ్యాణ్ నన్ను గెలిపించండని టీడీపీ నాయకులను వేడుకోవడంలోనే ఆయన వైఫల్యం ఏంటో అర్థమవుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ డెప్యూటీ మేయర్ గోగుల రమణారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, దేవిరెడ్డి రమేష్‌రెడ్డి, నందెపు సురేష్, షేక్ నాగుల్‌మీరా, కోలా శాంతకుమారి, జిలాని, కృష్ణ, అమిత్, కొండా జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపిస్తా..



అరండల్‌పేటలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. గురువారం నియోజకవర్గ పరిధిలోని 25వ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ బంకా శకుంతలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అరండల్ పేటలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని గెలిపిస్తే అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతుందన్నారు. సంక్షేమ పథకాలను డోర్ డెలివరీ చేస్తామన్నారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 25వ డివిజన్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్ (విజయవాడసెంట్రల్): రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు విజయాన్ని కాంక్షిస్తూ గురువారం 32వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వెలంపల్లి సోదరుడు రాఘవ, అల్లుడు మంచుకొండ చక్రవర్తి, కుమార్తె సాయి అశ్విత, కేశినేని నాని అల్లుడు కాజా రఘునాథంతో కలిసి ఆయన ఇంటింటికీ పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. ఎమ్మెల్యేగా వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీగా కేశినేని నానిలను ఆదరించి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ జగనన్న అందించిన సంక్షేమ పథకాలు ప్రజల్లో విశేష ఆదరణ పొందాయన్నారు. ప్రభుత్వం చేసిన మంచితోనే ఎన్నికల ప్రచారంలో విశేషంగా స్పందన వస్తోందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలన్న, సంక్షేమ పథకాలు కొనసాగాలన్న మరలా సీఎంగా జగన్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో తమ విలువైన ఓట్లను ఫ్యాను గుర్తుపై వేసి అఖండ విజయాన్ని చేకూర్చడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో 32వ డివిజన్ ఇన్‌చార్జి గుండె సుందరపాల్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



32వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు

దుర్గగుడిపై నేడు నూతన యాగశాలలో పూజలు



అమ్మవారి సన్నిధిలో అందుబాటులోకి వచ్చిన యాగశాల

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై నూతనంగా నిర్మించిన యాగశాలలో శుక్రవారం పూజలు నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయం నుంచి మల్లేశ్వర స్వామి వారి ఆలయానికి చేరుకునే దారిలో రాధాకృష్ణుల విగ్రహం వద్ద సుమారు 250 గజాలల్లో ఈ యాగశాల నిర్మించారు. రెండు నెలల్లో పూర్తైన యాగశాలను దాత సంగా నరసింహారావు రూ. 5 కోట్లతో నిర్మించారు. దీనికి అవసరమైన రాతి స్తంభాలు, చప్పురాయి, రాతి భీములు, పాదికలను క్వారీ వద్దే తయారు చేసి క్రేన్ సాయంతో కొండపైకి చేర్చారు. గురువారం యాగశాలను దుర్గగుడి ఈఓ కె.ఎస్.రామరావు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. శుక్రవారం ఉదయం 10.45 గంటల సమయంలో యాగశాల ప్రారంభోత్సవం జరుగుతుందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. తొలుత పుణ్యాహవచనం, గణపతి పూజ, మండపారాధన, చండీ మూలమంత్ర హోమం నిర్వహిస్తారు. యాగశాల తుది మెరుగులు దిద్దేందుకు చిన్న పాటి పనులు మిగిలి ఉండగా, మరో నాలుగు నెలల పాటు మంచి ముహూర్తాలు లేకపోవడంతో శుక్రవారం ముహూర్తాన్ని ఆలయ స్థానాచార్య, వైదిక కమిటీ ఖరారు చేసింది. దీంతో యాగశాల వద్ద పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపున ఘాట్ రోడ్డులోని సమాచార కేంద్రం వద్ద డోనర్ సెల్ భక్తులకు శుక్రవారం నుంచే అందుబాటులోకి రానుంది. అమ్మవారికి విరాళాలు ఇచ్చే భక్తులు, దాతలు సౌకర్యార్థం సెల్‌ను ఏర్పాటు చేశారు.

మే 1న జయహో జానపదం

విజయవాడకల్చరల్: దామోదర జానపదం, మామ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మే ఒకటో తేదీ ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో జయహో జానపదం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అంతర్జాతీయ గాయకుడు దామోదర గణపతిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గాయనీ గాయకులు జానపద గీతాలను ఆలపిస్తారని, అనంతరం వారికి సత్కార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

తండ్రి గెలుపునకు కుమార్తె ప్రచారం



లబ్బీపేట(విజయవాడ తూర్పు): వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును గెలిపించాలని కోరుతూ ఆయన కుమార్తె డాక్టర్ సాయి అశ్విత స్థానిక కస్తూరిబాయిపేటలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వెల్లంపల్లి శ్రీనివాసరావును బలపర్చి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఘన విజయం చేకూర్చాలని ఆమె కోరారు. కార్యక్రమంలో 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత రమేష్, వెలంపల్లి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనే ప్రధాన లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న జమీల్



రైల్వే ఆస్పత్రిలో మలేరియాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మలేరియా వ్యాధి వచ్చిన తర్వాత కంటే ముందుగా నివారించడం మనందరి ప్రధాన లక్ష్యమని యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జమీల్ అన్నారు. ప్రపంచ మలేరియా డేను పురస్కరించుకుని యూపీహెచ్‌సీ గులాం మొహిద్దీన్‌నగర్‌లోని మలేరియా సబ్ యూనిట్–1 ఆఫీసర్ నగేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జమీల్ మాట్లాడుతూ 2027 నాటికి మలేరియా కేసులు లేకుండా చేయడంతోపాటు 2030కి మన దేశంలో మలేరియాను నిర్మూలించడమే లక్ష్యమన్నారు. మలేరియా నివారణ కోసం పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడటంతో పాటు దోమల లార్వా వృద్ధి చెందకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దోమల లార్వా నిర్మూలన కోసం సిబ్బంది క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే శివారు ప్రాంతాల్లో నివసించే వారు దోమ తెరలు వినియోగించేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో మలేరియా సూపర్‌వైజర్లు నిరీక్షణరావు, గజేంద్ర, హెచ్‌వీ జయలక్ష్మి, మలేరియా సిబ్బంది, యూపీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మలేరియా జ్వరాలపై అవగాహన పెంచుకోవాలి..

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): మలేరియా జ్వరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రైల్వే ఆస్పత్రి అదనపు చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.జయదీప్ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవంలో భాగంగా గురువారం రైల్వే హాస్పిటల్ కొత్త ఓపీలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే కాలనీల్లో, చుట్టు పక్కల నీరు నిలువకుండా చూసుకోవాలని దీంతో దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయన్నారు. డాక్టర్ పూర్ణచంద్రరావు ప్రజలకు మలేరియా జ్వరం వచ్చినప్పుడు లక్షణాలు ఎలా ఉంటాయి, తీసుకోవలసిన జాగ్రత్తలు, చికిత్స విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ వి.వాసుదేవ రావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు అండగా వైఎస్సార్ సీపీ



మస్తాన్ వలీని సత్కరిస్తున్న విజయ్‌కుమార్

పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటుందని ఆ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్ కుమార్ అన్నారు. స్థానిక 62వ డివిజన్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విజయవాడ నగర వైఎస్సార్ సీపీ మైనార్టీ అధ్యక్షుడిగా నియామకమైన షేక్ మస్తాన్ వలీకి గురువారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ అధినేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు చెందిన అనేక మందిని గతంలో ఎన్నడూలేని విధంగా నామినేటెడ్ పదవుల్లో నియమించారన్నారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు పార్టీకి సేవలందించిన అనేక మందిని నామినేటెడ్ పదవుల్లో నియమింప చేశారన్నారు. భవిష్యత్‌లో షేక్ మస్తాన్ వలి మరింత ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన్ని శాలువతో సత్కరించారు. సన్మాన గ్రహీత మస్తాన్ వలి మాట్లాడుతూ రెండు నెలల కాలంలో 256 మందిని వెలంపల్లి శ్రీనివాసరావు నామినేటెడ్ పదవుల్లో నియమించారని తెలిపారు. కష్టపడి పని చేసేవారిని పార్టీ గుర్తిస్తుందని పేర్కొన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జాయింట్ సెక్రటరీగా నియమించబడిన వేము హైమావతిని సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రామిరెడ్డి, బొర బుజ్జి, షేక్ మస్తాన్, మహేష్, రాజారెడ్డి, వెంకట్, సావిత్రి, రాధ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రంగమ్మ పేరంటాల తిరునాళ్ల

ఉంగుటూరు: తేలప్రోలులో రంగమ్మ పేరంటాల తిరునాళ్ల మూడో రోజు గురువారం వైభవంగా కొనసాగుతున్నాయి. పరిసర గ్రామాల నుంచి భక్తులు ప్రభ బండ్లతో ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి తమ మొక్కుబడులను చెల్లించుకుంటున్నారు. అర్ధరాత్రి అమ్మవారి ఊయల ఊగే కార్యక్రమం ఆ సమయంలో భక్తులు ఆలయం వద్దకు చేరుకుని భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని తిలకించారు. తిరునాళ్లను జక్కా వారసులు పర్యవేక్షించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

స్వరఝురి సంగీత కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకోవాలి



సంగీత కచేరీ నిర్వహిస్తున్న విద్వాంసులు

విజయవాడకల్చరల్: స్వరఝురి సంస్థ నిర్వహించే సంగీత కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకోవాలని సంగీత విద్వాంసుడు కొంమాండూరి శేషాద్రి అన్నారు. స్వరఝురి సంగీత సంస్థ 36వ వార్షిక వేడుకలు, సంగీత విద్వాంసులకు వార్షిక పురస్కారాలు, వాయిలీన త్రయం సంగీత కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. శేషాద్రి మాట్లాడుతూ స్వరఝురి సంగీత సేవలను కొనియాడారు. సంస్థ ప్రధాన కార్యదర్శి మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కొంమాండూరి శేషాద్రికి స్వరఝురి, చింతల పాటి రాజ్యలక్ష్మి స్మారక పురస్కారం, మృదంగ విద్వాంసురాలు దండమూడి సుమతీ రామ్మోహనరావుకు లయ ప్రవీణ బిరుదును ప్రదానం చేశారు. సంగీత కార్యక్రమంలో భాగంగా కొంమాండూరి శేషాద్రి, కొంమాండూరి అనంత శౌరిరాజన్, డాక్టర్ కొంమాండూరి వెంకటకృష్ణ వయోలిన్‌పై శ్రీ రాఘవంతో ప్రారంభించి మహాగణపతిం, గాన మూర్తి, జ్ఞాన మొసగరాదా, దొరుకునా ఇటువంటి సేవ కీర్తనలను పలికించారు. బీవీఎస్ ప్రసాద్, ఎమ్ హరిబాబు వాద్య సహకారం అందించారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసులు అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, టీడీపీ కూటమికి ముస్లింల సత్తా చూపిస్తాం

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మతాల మధ్య చిచ్చుపెట్టేలా చేస్తున్న బీజేపీ, టీడీపీ, జనసేన కూటమికి రాష్ట్రంలోని ముస్లింల సత్తా ఏంటో చేసి చూపుతామని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. సింగ్‌నగర్ 59వ డివిజన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముస్లిం మైనార్టీలకు మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అందించిన గొప్ప వరం నాలుగు శాతం రిజర్వేషన్ సౌకర్యం అని, కానీ బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి దానిని ఎత్తివేస్తామని చెప్పడం సిగ్గుచేటని ఎమ్మెల్సీ రుహుల్లా మండిపడ్డారు. బీజేపీ నాయకులు బహిరంగ సభల్లో మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు కేటాయించిన నాలుగు శాతం రిజర్వేషన్‌ను ఎత్తివేస్తామని చెప్పడం దౌర్భాగ్యమని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ముస్లిం మైనార్టీలంతా ఏకతాటిపైకి వచ్చి బీజేపీ, టీడీపీ కూటమికి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

హోమియో మందుల పంపిణీ

నందిగామ: పట్టణానికి చెందిన సత్య దివ్యాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం వడదెబ్బ నివారణకు హోమియో మందులు పంపిణీ చేశారు. మండలంలోని మునగచర్ల పరిసర ప్రాంతాలలో పనిచేస్తున్న 500 మంది వ్యవసాయ కూలీలకు ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేశారు. సేవా సమితి నిర్వాహకుడు రామిరెడ్డి కోటి సూర్యం పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



పెనమలూరు: కానూరు షాంరాక్ ఇంటర్నేషనల్ పాఠశాలలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పాఠశాలలో బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ సొంగా రత్నమంజుల చిన్నారులకు పట్టాలు ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలు ఆటపాటలతో పాటు విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ టి.సుమన్‌త్యాగరాజు, అధ్యక్షురాలు మౌనికా సుమన్, ప్రిన్సిపాల్ డాక్టర్ భారతీధర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 'శారద' విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు



బి.తన్విక 1140వ ర్యాంకు



ఎ.సంపత్ 1441 ర్యాంకు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జేఈఈ మెయిన్స్–2024 ఫలితాల్లో తమ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని శారద విద్యాసంస్థల చైర్మన్ వై.రమేష్‌బాబు ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి ఓపెన్ కేటగిరిలో బి.తన్విక–1140వ ర్యాంకు, ఎ.సంపత్–1441 ర్యాంకు, పి.అస్మిత–3690వ ర్యాంకు, బి.నిత్యశ్రీ–4630వ ర్యాంకు, కె.నాగరాహుల్ ధృవ–5150వ ర్యాంకు, కె.ఉదయ బాల కుమార్–6598వ ర్యాంకులను పొందారని తెలియజేశారు. కేవలం డే స్కాలర్స్ విద్యార్థులతోనే ఇలాంటి ఉత్తమ ఫలితాలను సాధించగలుగుతున్నామని తెలిపారు. తమ విద్యాసంస్థ నుంచి మొత్తం 650 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 350 మంది ఉత్తమ ర్యాంకులు పొందారని వివరించారు. ఒత్తిడి లేని విలువలతో కూడిన విద్య, విద్యార్థుల క్రమశిక్షణ, అధ్యాపకులు సలహాలు, సూచనలతో పాటుగా ప్రశాంత వాతావరణం, ఆన్‌లైన్ పరీక్ష ప్రణాళిక విద్యార్థులకు ఇలాంటి ర్యాంకులు పొందడానికి అనుకూలించిన అంశాలని కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి పేర్కొన్నారు. ఈ ర్యాంకులు సాధించడానికి కళాశాల మేనేజ్‌మెంట్ విద్యార్థులపై చూపిన వ్యక్తిగత శ్రద్ధ, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం ఎంతో ఉందని కళాశాల సలహాదారుడు ఈఎస్ఆర్‌కే.ప్రసాద్, కళాశాల జనరల్ మేనేజర్ జీవీ.రావు పేర్కొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

పెనమలూరు: కొద్ది రోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైన వ్యక్తి గురువారం కృష్ణానదిలో శవమై తేలాడు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కార్మికనగర్‌కు చెందిన జక్కంపూడి నాగరాజు(29) అవివాహితుడు. హౌస్‌కీపింగ్ పని చేస్తాడు. అతని ఇంటి ఎదురుగా ఉండే లాల్‌బీ కోరిక మేరకు బంగారు చెవి బుట్టలు తాకట్టు పెట్టి డబ్బు తీసుకువచ్చి ఆమెకు ఇచ్చాడు. తాకట్టు పెట్టిన బంగారు చెవి బుట్టల విషయంలో ఆమెకు, నాగరాజుకు మధ్య వివాదం తలెత్తడటంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు నాగరాజుపై కేసు నమోదు చేశారు.గత నెల 15 నుంచి నాగరాజు కనిపించలేదు. కాగా ఈ నెల 22న నాగరాజు సోదరికి వాట్సాప్ మెసేజ్ చేశాడు. బైక్, ఫోన్, లెటర్ ప్రకాశం బ్యారేజ్ వద్ద ఉంచానని మెసేజ్‌లో పేర్కొన్నాడు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రకాశం బ్యారేజీ వద్దకు వెళ్లి చూడగా బైక్, వస్తువులు ఉన్నాయి. అయితే నాగరాజు కనబడలేదు. దీంతో నాగరాజు తల్లి వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అతని కోసం గాలించగా గురువారం కృష్ణానదిలో శవమై కనిపించాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.